క్లుప్తంగా

వెంకయ్యస్వామికి విశేష పూజలు



మనుబోలు: మండల పరిధిలోని బీసీ కాలనీ సమీపంలో గల వెంకయ్యస్వామి మందిరంలో విశేష పూజలను శనివారం నిర్వహించారు. పంచామృతాభిషేకం తదితర పూజా కార్యక్రమాలను అర్చకుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిపారు. భక్తులు భారీగా తరలివచ్చి దర్శించుకున్నారు. భక్తులకు అన్నదానాన్ని మధ్యాహ్నం నిర్వహించారు. ఉభయకర్తగా చిట్టమూరు నరసారెడ్డి వ్యవహరించారు.

నగరంలో దొంగల హల్‌చల్

- మూడిళ్లల్లో చోరీలు

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు నగరంలో శనివారం పట్టపగలు దొంగలు హల్‌చల్ చేశారు. చిన్నబజారు, వేదాయపాళెం పోలీస్‌స్టేషన్ల పరిధిలోని మూడు ఇళ్లల్లో రూ.లక్షల విలువచేసే సొత్తును దోచుకెళ్లారు. ప్రాథమిక సమాచారం మేరకు.. సాయినగర్‌లో ఉమాకాంత్ దంపతులు నివాసం ఉంటున్నారు. ఆయన టీస్టాల్‌లో పని చేస్తుండగా, భార్య బ్యూటీషియన్. ఇద్దరూ శనివారం పనులకు వెళ్లారు. ఈ క్రమంలో గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని మూడున్నర సవర్ల బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. రాత్రి బాధితులు ఇంటికి రాగా తలుపులు తెరచి ఉండటం, బీరువాలోని ఆభరణాలు కనిపించకపోవడంతో చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

⇨ మనుమసిద్ధినగర్‌లో సోమశ్వరి కుటుంబం నివాసం ఉంటోంది. వారు శనివారం ఒంగోలులో బంధువుల ఇంటికి వెళ్లారు. గుర్తుతెలియని దుండగులు ఆమె ఇంటి తాళాలు పగులగొట్టి సుమారు 20 సవర్లకు పైగా బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. రాత్రి ఒంగోలు నుంచి ఇంటికి చేరుకున్న బాధితులు చోరీ ఘటనపై చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

⇨ తెలుగుగంగ కార్యాలయ సమీపంలోని నిర్మలానగర్‌లో పిచ్చయ్య దంపతులు నివాసం ఉంటున్నారు. వారిద్దరూ ఉపాధ్యాయులు. వారు శనివారం విధులకు వెళ్లారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని సుమారు 30 సవర్ల బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. విధులు ముగించుకుని రాత్రి ఇంటికి వచ్చిన దంపతులు చోరీ జరిగినట్లు గుర్తించి వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మూడు ఘటనా స్థలాల్లో క్లూస్‌టీమ్ వేలిముద్రలను సేకరిస్తోంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బంగారు సరుడును తీసుకెళ్లి.. తాకట్టుపెట్టి..

నెల్లూరు(క్రైమ్): నమ్మకంగా బంగారు సరుడును తీసుకెళ్లి తాకట్టుపెట్టిన మహిళపై చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. మన్సూర్‌నగర్‌లో రాధా కుటుంబం నివాసం ఉంటోంది. ఈ ఏడాది మార్చిలో ఆమె వద్దకు పిన్నమ్మ కుమార్తె ఇందిర వచ్చింది. బంధువుల వివాహం ఉందని బంగారు సరుడు ఇస్తే వివాహానంతరం తిరిగి తెచ్చిస్తానని చెప్పింది. దీంతో రాధా తన మెడలోని రెండున్నర సవర్ల బంగారు సరుడును ఇచ్చింది. రోజులు గడుస్తున్నా తిరిగి ఇవ్వలేదు. పలుమార్లు అడిగినా కాలయాపన చేస్తూ వచ్చింది. దీంతో అనుమానం వచ్చి రాధా ఆరాతీయగా సరుడు తాకట్టులో ఉన్నట్లు తెలిసింది. దీంతో ఇందిరపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు శనివారం చిన్నబజారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

దీక్ష విరమణ

నెల్లూరు(బారకాసు): అక్రమ బదిలీ రద్దుకు నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో గత తొమ్మిది రోజులుగా కావలి సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ రావెళ్ల భాస్కర్ చేపట్టిన నిరసన దీక్షకు అధికారులు స్పందించారు. ఆయన్ను డిప్యూటేషన్‌పై గుంటూరు కార్పొరేషన్‌కు బదిలీ చేయడంతో శనివారం ఆయన దీక్షను విరమించారు.

ఎదురుచూపులే మిగిలాయి

- రైతులను వెంటాడుతున్న యూరియా కొరత
- సొసైటీల వద్ద బారులు తీరుతున్న అన్నదాతలు



జేజేపేట సొసైటీలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

ఇందుకూరుపేట: కూటమి ప్రభుత్వంలో యూరియా కష్టాలు వెంటాడుతూనే ఉంది. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు యూరియా కోసం రైతులకు ఎదురుచూపులే మిగిలుతోంది. ఎక్కడా యూరియా దొరక్కపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఒకప్పుడు ఎక్కడ చూసినా అందుబాటులో ఉన్న యూరియా నేడు అందుబాటులో లేకపోవడంతో అల్లాడిపోతున్నారు.

ఎరువులు కొంటేనే యూరియా

మండలం వ్యాప్తంగా ఎక్కువగా వరి, అరటి, కూరగాయ పంటలు సాగులో ఉన్నాయి. ఈ పంటలకు యూరియా వాడకం తప్పనిసరి. ముఖ్యంగా వరి పంటకు యూరియా వేయాల్సి ఉంటుంది. దీనినే ఆసరాగా చేసుకుని యూరియా బస్తా కావాలంటే రసాయన ఎరువు బస్తా తీసుకోవాలని దుకాణాల యజమానులు షరతులు విధిస్తున్నారు. దీంతో రైతులు తప్పని పరిస్థితుల్లో అవసరం లేకపోయినా ఎరువుల బస్తాను కూడా కొనుగోలు చేస్తున్నారు. దీనివల్ల రైతులపై అదనపు భారం పడుతోంది.

గతంలో..

గత ప్రభుత్వంలో నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని రైతు భరోసా కేంద్రాల్లో యూరియా నిల్వలు ఉండేది. ఎక్కడైనా యూరియా కొరత ఏర్పడినా అధికారులు, ప్రజా ప్రతినిధులు సకాలంలో స్పందించి రైతులకు సమకూర్చేవారు. అయితే ప్రస్తుత ప్రభుత్వంలో యూరియా అందక రైతులు ఇక్కట్లు పడుతున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు.



పడిగాపులు కాస్తున్న రైతులు

యూరియాను అందుబాటులో ఉంచాలి

రైతులకు అండగా నిలవాల్సిన రైతు సేవా కేంద్రాలు వెలవెలబోతున్నాయి. దీనివల్ల యూరియా అందుబాటులో ఉండడం లేదు. యూరియా కోసం ఎదురుచూసి ఇతర రసాయన ఎరువులను వేస్తున్నాం. దీనివల్ల సాగు ఖర్చులు పెరిగిపోతున్నాయి. అరటి పంటకు యూరియా ఎంతో అవసరం. అవసరమైన యూరియా రైతులకు అందుబాటులో ఉంచాలి.

– మీరా, కొరుటూరు , ఇందుకూరుపేట

నిలువు దోపిడీ చేస్తున్నారు

యూరియా కొరతను ఎరువుల దుకాణ యజమానులు ఆసరాగా చేసుకుని రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. ఎరువులు కొంటేనే యూరియా ఇస్తామని నిబంధనలు పెడుతున్నారు. దీనివల్ల ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం.

– పుల్లా శ్రీధర్, గంగపట్నం

మోతాదుకు మించి వాడుతున్నారు

మండలంలో వరిసాగు నాలుగు వేల ఎకరాల్లో, ఉద్యాన పంటలు 2 వేల ఎకరాల్లో సాగులో ఉంది. అందుకు కావాల్సిన యూరియా తొమ్మిది వందల టన్నులు సరిపోతుంది. కానీ ఇప్పటి వరకు 14 వందల టన్నులు సరఫరా చేశాం. రైతులు మోతాదుకు మించి యూరియాను వాడుతున్నారు.

– రఘునాథ్‌రెడ్డి, ఏఓ, ఇందుకూరుపేట

నార్తురాజుపాళెంలో 'ఫ్యామిలీ డాక్టర్'

కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా యల్లాయపాళెం వైద్యాధికారి కామాక్షయ్య పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం మంచానికే పరిమితమైన రోగులకు ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. దీనిని గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎస్ వి.రామ్మోహన్, హెచ్‌ఏ ఎస్కే షఫీ ఉద్దీన్, ఎంఎల్‌హెచ్‌పీ స్నేహ, ఆశా కార్యకర్త మాధవి పాల్గొన్నారు.



పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

మనుబోలు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని.. ప్లాస్టిక్ బ్యాగుల స్థానంలో వస్త్ర సంచులను వినియోగించాలని ఎంపీడీఓ జలజాక్షి పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్రలో భాగంగా మండలంలోని మడమనూరులో పర్యావరణ పరిరక్షణపై శనివారం అవగాహన కల్పించారు. అనంతరం నిర్వహించిన ర్యాలీలో ఆమె మాట్లాడారు. హైస్కూల్ పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. డిప్యూటీ ఎంపీడీఓ నారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కసనానాయక్, హెచ్‌ఎం రాధాకృష్ణ, కార్యదర్శి బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎనలేనివి



పారిశుద్ధ్య కార్మికులతో సమావేశమైన కలెక్టర్ ఆనంద్



పారిశుద్ధ్య కార్మికురాలిని సన్మానిస్తున్న కలెక్టర్

నెల్లూరురూరల్: స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య కార్మికులను గౌరవించుకోవడం ఎంతో సంతోషదాయకమని, వారి సేవలు ఎనలేనివి అని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. జిల్లాలోని పంచాయతీలు, మున్సిపల్ కేంద్రాల్లో పనిచేసే 25 మంది పారిశుద్ధ్య కార్మికులతో కలెక్టరేట్‌లోని ఎస్సార్ శంకరన్ హాల్లో కలెక్టర్ శనివారం ప్రత్యేకంగా సమావేశమై, వారిని సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే మొదటి వ్యక్తి పారిశుద్ధ్య కార్మికులు అని కొనియాడారు. గత ఆరు నెలలుగా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల నిర్వహణలో ప్రధాన భూమిక పారిశుద్ధ్య కార్మికులదేనన్నారు. జిల్లాలో స్వచ్ఛత కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు సమష్టిగా కృషి చేద్దామన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు విరివిగా బ్యాంకు రుణాలు అందించేందుకు కృషి చేస్తామన్నారు.

పరికరాల కిట్ల అందజేత

గ్రామస్థాయిలో తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలపై ప్రజలు ఫిర్యాదు చేయుటకు జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో టోల్ ఫ్రీ నంబర్ 1800 425 0017ను ఏర్పాటు చేసినట్లుగా కలెక్టర్ తెలిపారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులను సన్మానించి వారికి అవసరమైన రక్షణ పరికరాల కిట్‌ను అందజేశారు. అదేవిధంగా స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో తమ వంతు సేవలందించిన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు గోను చిట్టిబాబు, గులాం షఫీఅహ్మద్, గడ్డం శశి తదితరులను సన్మానించారు.

రాజకీయ దాడులపై స్పందించాలి

విడవలూరు: కోవూరు నియోజకవర్గంలో జరుగుతున్న రాజకీయ దాడులపై సీఎం చంద్రబాబు స్పందించాలని రైతు సంఘాల అధ్యక్షుడు పోలిరెడ్డి అశోక్‌రెడ్డి అన్నారు. మండలంలోని చౌకచర్ల గ్రామంలో ఆయన శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, మాజీ మంత్రి ప్రసన్నకుమార్‌రెడ్డి మధ్య మాటల యుద్ధం దాడులకు దారితీసిందని, ఇకనైనా దీనికి అడ్డుకట్ట వేసి అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరారు.

నేత్రపర్వంగా పల్లకిసేవ



పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో గల శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో పల్లకిసేవను నేత్రపర్వంగా శనివారం నిర్వహించారు. స్వామివారు విశేషాలంకారంలో దర్శనమిచ్చారు. అభిషేకాలు, పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలను అందజేశారు.

రైల్వే పోలీసులకు ఆరోగ్య పరీక్షలు

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు రైల్వే పోలీస్‌స్టేషన్‌లో మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే పోలీసులకు బీపీ, షుగర్, ఈసీజీ, రక్తపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేశారు. నెల్లూరు రైల్వే డీఎస్పీ జి.మురళీధర్, సీఐ ఎ.సుధాకర్, ఎస్సై హరిచందన పాల్గొన్నారు.

వ్యక్తిగత విమర్శలు తగవు

విడవలూరు: వైఎస్సార్‌సీపీ కోవూరు ఎస్సీసెల్ కన్వీనర్ అనపల్లి ఉదయ్‌భాస్కర్‌పై కొందరు టీడీపీ నేతలు వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. మండలంలోని చౌకచర్ల గ్రామంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై దాడిని నిరసిస్తూ ఉదయ్‌భాస్కర్ మాట్లాడితే ఆయనపై వ్యక్తిగత విమర్శలు చేస్తూ, ఊరులోకి కూడా రానివ్వకుండా అడ్డుకుంటామంటూ మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. స్థాయి మరచి మాట్లాడొద్దని హితవు పలికారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఎల్లు స్టాలిన్, అలగర మనోజ్, నావూరు హేమంత్, శ్రీహరి, సాదేపల్లి కిశోర్, గున్నం అశోక్, సాదేపల్లి యేశోబు తదితరులు పాల్గొన్నారు.



వసతిగృహంలో వైద్య శిబిరం

పొదలకూరు: మండలంలోని మహ్మదాపురం ఎస్సీ, బీసీ వసతిగృహాల్లో వైద్యశిబిరాన్ని విరువూరు ఆయుర్వేద డాక్టర్ వినోద్‌బాబు శనివారం నిర్వహించారు. 320 మంది విద్యార్థులను పరీక్షించి ఆయుర్వేద మందులను అందజేశారు. ఆరోగ్య సూత్రాలను వివరించి వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ఫార్మసిస్ట్ ఎబినైజర్ తదితరులు పాల్గొన్నారు.



కళ్లలోకి పొట్టు.. తరచూ ప్రమాదాలు



పొట్టు లోడు ట్రాక్టర్లు

వెంకటాచలం: మండల పరిధిలోని జాతీయ రహదారిపై పొట్టు లోడుతో ట్రాక్టర్లు యథేచ్ఛగా తిరుగుతున్నాయి. వెంకటాచలం మీదుగా ముత్తుకూరు మండలంలోని వివిధ పరిశ్రమలకు ఇవి రాకపోకలు సాగిస్తుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెనుక వచ్చే ద్విచక్ర వాహనదారుల కళ్లలోకి పొట్టు పడుతుండటంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రవాణా, పోలీస్ శాఖ అధికారులు నామమాత్రంగా జరిమానాలు విధించి వదిలేస్తుండటంతో వీరి ఆగడాలు శ్రుతిమించుతున్నాయి. వీటిపై చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఏ హామీ నెరవేర్చారో చెప్పండి



మాట్లాడుతున్న కాకాణి పూజిత

తోటపల్లిగూడూరు: హామీలన్నింటినీ నెరవేర్చామని సీఎం చంద్రబాబు చెప్పన్నారని, అసలు దేన్ని నెరవేర్చారో ఆయన తెలపాలని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె కాకాణి పూజిత ప్రశ్నించారు. బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా నరుకూరు సెంటర్‌లోని కల్యాణ మండపంలో శనివారం నిర్వహించిన పార్టీ నేతలు, కార్యకర్తల సమావేశానికి హాజరైన ఆమె మాట్లాడారు. హామీల అమల్లో సీఎం పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. తల్లికి వందనాన్ని అరకొరగా అమలు చేశారని, మరేమి నెరవేర్చారో చెప్పాలని ప్రశ్నించారు. గత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసి జనరంజక పాలనను సాగించారని కొనియాడారు. అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రస్తుతం గాలికొదిలి.. ప్రశ్నించే ప్రతిపక్ష పార్టీ నేతలు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తుండటం దుర్మార్గమన్నారు. అక్రమ కేసుల్లో భాగంగానే కాకాణి గోవర్ధన్‌రెడ్డిని జైలుకు పంపారని ఆరోపించారు. చర్యకు ప్రతీకార చర్య ఉంటుందనే విషయాన్ని కూటమి పాలకులు గుర్తుంచుకొని ఇప్పటికైనా సుపరిపాలనను అందించేలా కృషి చేయాలని హితవు పలికారు. అనంతరం రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి, మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, జెడ్పీటీసీ సభ్యులు ఎంబేటి శేషమ్మ, ఎంపీపీ ఉప్పల స్వర్ణలత, వైస్ ఎంపీపీ చెరుకూరు శ్రీనివాసులునాయుడు, నేతలు కావలిరెడ్డి రంగారెడ్డి, గూడూరు విష్ణుమోహన్‌రెడ్డి, టంగుటూరు పద్మనాభరెడ్డి, మన్నెం చిరంజీవులుగౌడ్, తలమంచి సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉందాం



పొదలకూరు మండల కేంద్రంలో..

పొదలకూరు: స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్రలో భాగంగా ప్లాస్టిక్ వాడకానికి దూరంగా ఉండాలని ఎస్సై హనీఫ్ పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి పంచాయతీ బస్టాండ్ వరకు పట్టణంలోని విజ్ఞాన్ కళాశాల విద్యార్థులతో ర్యాలీని శనివారం నిర్వహించారు. ప్లాస్టిక్‌ను నిషేధిద్దామంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపల్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

⇨ ఇందుకూరుపేట: ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి తీరని నష్టం ఏర్పడుతోందని జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని మైపాడులో శనివారం జరిగిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో డీపీఓ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ప్లాస్టిక్‌ను దూరంగా ఉంచడం బాధ్యతగా తీసుకోవాలన్నారు. గుడ్డ సంచులు, జ్యూట్ బ్యాగులను వినియోగించాలని కోరారు. తొలుత గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పిల్లలు, అధికారులు కలిసి స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. అనంతరం గ్రామంలో చేపట్టిన పారిశుద్ధ్య పనులను, కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. డిప్యూటీ ఎంపీడీఓ పెంచలశ్యామ్, సర్పంచ్ సంగం వెంకయ్య, పంచాయతీ కార్యదర్శి టి.సురేష్ పాల్గొన్నారు.

⇨ కోవూరు: ప్రజలు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని ఎంపీడీఓ శ్రీహరిరెడ్డి అన్నారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ అనర్థాలపై మండలంలోని పడుగుపాడు ఇనమడుగు సెంటర్‌లో శనివారం ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం భారీ ర్యాలీ చేపట్టారు. పచ్చదనం ప్రాధాన్యతను వివరిస్తూ చెట్లు నాటారు. పంచాయతీ కార్యదర్శి పద్మజారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



ఇందుకూరుపేట: మైపాడులో ర్యాలీ



కోవూరు: ఇనమడుగు సెంటర్‌లో..

అధ్వానంగా రహదారులు



వరకవిపూడి - అనంతపురం రహదారి ఇలా..



గుంతలమయంగా మారిన కోడూరు బీచ్ రోడ్డు

తోటపల్లిగూడూరు: మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో గల పలు పంచాయితీ శాఖ రహదారులు అధ్వానంగా మారాయి. కోడూరు బీచ్ రోడ్డు, వరకవిపూడి – అనంతపురం రోడ్డు, వెంకన్నపాళెం రహదారి, చింతోపు లింకు రోడ్డు దుర్భరంగా మారాయి. ఈ క్రమంలో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వారు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి రోడ్లను బాగుచేసే దిశగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.